www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 నవంబర్ 2022

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి : ఎంపిపి

ప్రజాశక్తి -కలకడ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన కలకడ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయానికి సమయానికి వచ్చి తమకు సూచించబడిన రిజిస్టర్ లలో సంతకాలు చేయాలని సూచించారు. ఉదయం కార్యాలయానికి వచ్చి ఫీల్డ్ పై వెళ్లేటప్పుడు సంతకాలు చేసి వెళ్తున్నారని, తిరిగి కార్యాలయానికి రాకుండా రిజిస్టర్లలో సంతకాలు చేయకుండా సమయం వేయకుండా వెళ్లడం సరైన పద్ధతి కాదని గుర్తు చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి నందిని సచివాలయం కార్యాలయం లేకపోవడంతో సిబ్బందిని విచారించగా సెలవులు ఉందని చెప్పారన్నారు. సచివాలయానికి వివిధ సమస్యలతో వచ్చే ప్రజలతో సానుకూలంగా ఉండి మమేకమై వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, డిజిటల్ అసిస్టెంట్ శ్రీలత, కార్యాలయ సిబ్బంది, సాయి, వాలంటీర్ ఇమ్రాన్ భాష పాల్గొన్నారు.

రుణాలకు కసరత్తు

- రూ.2 కోట్లతో ఎన్‌హెచ్‌డిఎఫ్‌సి రుణాలు
- ఉభయ జిల్లాల్లో 9,120 మంది గుర్తింపు
- 40 మంది విభిన్నప్రతిభావంతులకు వర్తింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జాతీయ విభిన్న ప్రతిభా వంతుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సంక్షేమానికి సంబంధించి రుణాల మంజూరుకు కసరత్తు చేస్తోంది. ఎన్‌హెచ్‌డిఎఫ్ కార్పొరేషన్ బృందం జిల్లాలో పర్యటించింది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుల డిపార్టుమెంట్ ఆశావహుల దరఖాస్తులను అందజేసింది. కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి నారాయణస్వామి జిల్లా పర్యటనలో భాగంగా రూ.రెండు కోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో విభిన్న ప్రతిభావంతుల్లో కదలిక వచ్చింది. కడప జిల్లాలో 48 వేల మంది, అన్నమయ్య జిల్లాలో 37 మంది చొప్పున 9,120 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నట్లు గుర్తించింది. వీరిలో స్వయంశక్తితో ఎదుగుదలను ఆశించిన ఉత్సాహవంతుల గుర్తింపులో భాగంగా కడప జిల్లా నుంచి 20 మంది, అన్నమయ్య జిల్లా నుంచి 20 మంది చొప్పున మొత్తం 40 మందిని విభిన్నప్రతిభావంతుల శాఖ ఉన్నతాధికారుల బృందం గుర్తించింది. 2023 జనవరి మాసంలో ప్రతి అభ్యర్థికి రూ.ఐదు లక్షల చొప్పున 60 నెలల వ్యవధిలో పావలా వడ్డీ ప్రకారం కంతుల వారీగా చెల్లించే ప్రాతిపదికన నిధులను విడుదల చేయనుంది. ఇడిబ్ అనే మరో పథకం కింద అర్హులైన 107 మంది విభిన్నప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, 46 మందికి వీల్ ఛైర్స్, మరో 18 మందికి హియరింగ్ పరికరాలు, వాకింగ్‌స్టిక్స్ మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వెల్ఫేర్ డిపార్టుమెంట్ల ద్వారా సంక్షేమ పథకాలు అటకెక్కిన నేపథ్యంలో ఎన్‌హెచ్‌డిఎఫ్ కార్పొరేషన్ ద్వారా నిధుల విడుదల చేయనుండడం ఊరట కలిగించిందనే చెప్పవచ్చు.

అంగన్వాడీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

అంగన్వాడీలకు 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూరగాయలు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ నెల రోజులు ముందుగా అడ్వాన్సుగా పేమెంట్ చేయాల్సి ఉందని, అధికారులు అమలు చేయడం లేదని తెలిపారు. ఇన్ని నెలలు నుండి పోపు సామాన్లు బిల్లులు చెల్లించకుంటే ఎలా పౌష్టిక ఆహారం అందిస్తారని ప్రశ్నించారు. బిల్లుల చెల్లించకుండానే రుచికరమైన వంట లు పెట్టాలని, ఐసిడిఎస్ అధికారులు వేధించుతున్నారని, మెమొలిస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధం లేని మహిళా వాలంటరీ పోలీసులు, సెంటర్లో విజిట్ చేస్తూ వేధిస్తున్నారన్నారు. ఇంటి అద్దెలు, సక్రంగా చెల్లించుకుంటే, ఇంటి యజమానులు, ఖాళీ చేయమంటున్నారని, సొంత బిల్డింగ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. 2017 నుండి టిఎ, డిఎలు రాకుండానే సమావేశాలకు రమ్మని అధికారులు ఆదేశాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల నుండి అనేక మందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని తక్షణ ఇవ్వాలన్నారు. 13 మంది ఆయాలు తక్షణం చెల్లించాలని పేర్కొన్నారు. సోమవారం లోగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే మంగళవారం మధ్యాహ్నం నుంచి ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ చంద్రశేఖర్, ప్రాజెక్టు అధ్యక్షులు రమాదేవి, ఉపాధ్యక్షులు, నిర్మల, సహాయ కార్యదర్శి సుజాతమ్మ, కోశాధికారి పద్మావతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ తులసిరామన్

విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తులసీరామన్ మాట్లాడుతూ ప్రపంచంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. విద్యార్థులు నూతన పరిశోధనలు చేసి సైబర్ క్రైమ్‌ను ఛేదించాలని పేర్కొన్నారు. కంప్యూటర్‌ను సాధనంగా లేదా తదుపరి నేరాలకు పాల్పడే మార్గంగా ఉపయోగించే అన్ని రకాల నేరపూరిత చర్యలు సైబర్ నేరాల కిందకు వస్తాయన్నారు. కంప్యూటర్ ద్వారా మోసాలకు పాల్పడటం లేదా టెక్నాలజీని ఉపయోగించి కంప్యూటర్లపై దాడి చేయడం చట్టవిరుద్ధమైన చర్యలని పేర్కొన్నారు. వీటిని అరికట్టడానికి కొత్త టెక్నాలజీలతో సాఫ్ట్వేర్‌లకు సెక్యూర్టీను అందిచగలిగేలా విద్యార్థులు ఉండాలన్నారు. టెక్నాలజీపై పట్టు సాధిచాలన్నారు. కార్యక్రమంలో డీన్ సిఎస్‌టి ప్రొఫెసర్ చక్రబర్తి, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, కో-ఆర్డినేటర్ నవీన్ పాల్గొన్నారు.

అసౌకర్యాలపై సిడిపిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి గాలివీడు

మండలంలోని గుండ్ల చెరువు పంచాయతీ వడ్డేపల్లిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో నెలకొన్న అసౌకర్యాలపై అంగన్వాడీ టీచర్, తల్లిదండ్రులు కలసి శనివారం లక్కిరెడ్డిపల్లె సిడిపిఒ పద్మావతికి ఫిర్యాదు చేశారు. సోమవారం తాను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని సిడిపిఒ వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డెన్న, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సంధ్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి ఘనతను వివరించారు. క్రీస్తు శకం 1828 నవంబరు 19న కాశీనగరంలో ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబంలో మణికర్ణిక పేరుతో జన్మించారని చెప్పారు. ఆమెకు 13 ఏళ్ల వయస్సులోనే ఝాన్సీ రాజ్యానికి రాజైన గంగాధర రావుతో వివాహమైందని చెప్పారు. 1852 నవంబరులో భర్త మరణించడంతో ఝాన్సీ రాజ్యానికి రాణి అయ్యారని తెలిపారు. తన రాజ్య ప్రజల కోసం పురుషుడితో సమానంగా కత్తి పట్టి గుర్రపు స్వారీ చేసి యుద్ధంలో పాల్గొన్న ధీశాలి అని కొనియాడారు.

పర్యాటక కేంద్రంగా మల్లయ్య కొండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, పర్యాటక శాఖ ఎమ్‌డి కన్నబాబు అన్నారు. శనివారం మల్లయ్య కొండ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ కొండపైన టూరిజం సంబంధించిన భవనాలు ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. రూ.ఆరు కోట్లతో భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లయ్య కొండ ఛైర్మన్ మల్‌రెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, ఎంపిపీ అనసూయ, మండల కన్వీనర్ చౌడేశ్వర్, స్థానిక సర్పంచ్ నీలుఫర్, మైనుద్దీన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాయల్ ఫిరోజ్ ఖాన్, మల్లయ్య కొండ వెబ్సైట్ డెవలపర్ గేరిగి రాజశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లయ్య కొండను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి : ఎంపిపి

ప్రజాశక్తి- కలకడ

ప్రస్తుత కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగులో జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటకీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులచే కలకడ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, పాఠశాల ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సరస్వతి ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మండల పరిధిలోని రాచవేటివారిపల్లి పంచాయతీలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీని నిర్వహించామన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మరుగుదొడ్లు ఉండటం వలన బయట ప్రాంతంలోకి మహిళలు బహిర్ భూమికి వెళ్ళనవసరం ఉండదన్నారు. తద్వారా పారిశుధ్యం మెరుగుప డుతుందని, ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా ఉంటారని తెలిపారు. ప్రజలకు మరుగుదొడ్ల ఆవశ్యకత వాటి నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం కవిత, జోష్ణ, ఉపాధ్యాయ బృందం, ప్రజలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మరుగుదొడ్ల ఆవశ్యకతపై నిర్వహించిన ర్యాలీలో సర్పంచ్

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శనివారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిఎం పర్యటనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన నాలుగో విడత పథకం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఈ నెల 25వ తేదీన మదనపల్లె వస్తున్నందున ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుండి సిఎం వెళ్లే రహదారి పొడవునా ప్రతి 100 మీటర్లకు ఒక అధికారిని నియమించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. హెలిప్యాడ్, బారికేడ్లు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు, భద్రతా సౌకర్యం, పార్కింగ్, ప్రోటోకాల్, సేఫ్ రూమ్ సౌకర్యం, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం కల్పన తదితర అన్ని రకాల ఏర్పాట్లు సక్రమంగా చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి తప్పులు దొర్లకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో జెడ్ ప్లస్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. టీములుగా ఏర్పడి అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు పబ్లిక్ టాయిలెట్స్ సభా స్థలంలో ఏర్పాటు చేయాలని మదనపల్లె మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలసిల రఘురాం మాట్లాడుతూ సిఎం పర్యటనను అందరం కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామన్నారు. సభ హాజరయ్యే విద్యార్థులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, తంబళ్లపల్లి, పీలేరు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్ర రెడ్డి, చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, మదనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజరెడ్డి, ఎపిఎండిసి ఛైర్‌పర్సన్ షమీం అస్లం, అడిషనల్ ఎస్పీ, ఆర్డీఓలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక టిప్పు సుల్తాన్ మైదానంలో సభా స్థలం కోసం జరుగుతున్న ఏర్పాట్ల పనులను అధికారులతో కలిసి కలెక్టర్ గిరీష పరిశీలించారు.

టిప్పు సుల్తాన్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

బతుకులు కూల్చడం చంద్రబాబుకు అలవాటే : 'చింతల'

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మాయమాటలు, మోసకారి కన్నీటిచుక్కలతో ఇళ్లు, జీవితాలను కూల్చేయడం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అలవాటేనని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పర్యటనలో చంద్రబాబు చెప్పిన వన్నీ పచ్చి అబద్ధాలని, ఈ వయస్సులో ఓ వీధి రౌడీలా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. 73 ఏళ్ల వయస్సు, 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల సిఎం అని చెప్పుకుంటూ ఎన్నికల్లో గెలిపిస్తే రాజకీయాల్లో ఉంటాననడం ఆయన నిరాశ, నిస్పృహకు అద్ధం పడుతోందన్నారు. గత ఐదేళ్ల పాలనలో టిడిపికి అనుకూలంగా ఉన్న కంపెనీలకు భూములను కేటాయించారని, అనుకూలంగా లేనివారికి భూములు కేటాయించకుండా వేధించారన్నారు. రాజు మంచోడైతే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నట్లుగానే ప్రతి చోట నీళ్లు ఉండేసరికి చూసి తట్టుకోలేక వైసిపి ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు. రైతులకు వేల బోర్లు వేయిస్తుంటే కేంద్ర ప్రభుత్వం వేయిస్తోందని ప్రజలను తప్పుదోవపట్టించడానికే అబద్ధపు కహానీలు చెబుతున్నారన్నారు. బాబు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శిస్తే ప్రజలు తిరగబడి బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కలీమ్, సైఫుల్లా, అమీర్, మసూద్, చికెన్ మస్తాన్, సమీవుల్లా పాల్గొన్నారు.



సౌమ్యనాథుని కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

వైభవంగా సౌమ్యనాథుని కల్యాణం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో సుప్రసిద్ధ చారిత్రాత్మక దేవాలయమైన నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసౌమ్యనాధ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు అరిగెల సౌమిత్రి చంద్రనాథ్ ఆధ్వర్యంలో రాజంపేటకు చెందిన మాచవరం ప్రతాప్ ఆచారి, లక్ష్మీ రాజేశ్వరి దంపతుల ఉభయ దారుల చేతుల మీదుగా ఈ కల్యాణం కనుల పండుగ జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి ఉభయ జిల్లా ల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి -కలకడ

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీధర్

మహిళలు, వృద్ధులు ఇచ్చే ఫిర్యాదులను త్వరితగతన పరిష్కరించాలని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ సిబ్బందిని ఆదేశిం చారు. శనివారం మండల కేంద్రమైన కలకడ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మహిళలు, వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో చోరీలు, పేకాట, జూదం అసాంఘిక కార్యక్రమాలు, నాటుసార తయారీ, అమ్మకాలు, వంటి వాటిపై శ్రద్ధ చూపి వాటి నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని గ్రామాలలో ఎవరైనా ముఖ పరిచయం లేని నూతన వ్యక్తులు వచ్చినచో గ్రామ ప్రజల ద్వారా మహిళా పోలీస్ ఫిర్యాదు తీసుకుని వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించేలా మహిళా పోలీసులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. మండలంలో ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందుకోసం ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండి, రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ఉండేలా చూడాలని లేకుంటే అలాంటి వారికి అపరాధ రుసుములతో పాటు కేసులు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎందరో ఐఎఎస్‌లను అందించిన పాఠశాల దీనస్థితి

కూలేందుకు సిద్ధంగా ఉన్న తరగతి గదులు

- కూలేందుకు సిద్ధంగా భవనాలు
- కళాశాల భవనాల సంగతి అంతేనా
- షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్న తరగతులు
- పాఠశాలలు తెరుచుకునే లోపైనా అభివృద్ధి సాధ్యమయ్యేనా
- అధికారులూ కాస్త దృష్టి సారించండి

ప్రజాశక్తి-నందలూరు

ఈ పాఠశాల ఎందరికో అభివృద్ధి బాటలు వేసింది. ఈ పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఎఎస్‌లు గాను, ఇంకొందరు ఐపిఎస్‌లు గాను, మరికొందరు ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల దీనస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. జిల్లాలోనే బ్రిటిష్ పాలన ముందు నుండి విద్యార్థులకు విద్యను అందించిన ఈ సరస్వతి నిలయం అభివృద్ధికి ఎప్పుడు నోచుకుంటుందో అర్థంకాని విషయంగా మారింది. రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు జిల్లా పరిషత్ పాఠశాల ఐఎఎస్‌లను అందించిన పాఠశాలగా చరిత్రకెక్కింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఈ పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నారు. అలాంటి పాఠశాల దుస్థితి నేడు దారుణంగా తయారైంది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుండి నేటి వరకు పాలించిన శాసనసభ్యులంతా నందలూరు వాసులు కావడం గమనార్హం. పాఠశాల ఇప్పటికే నూతన సోకులతో కార్పొరేట్ పాఠశాలలు తలదన్నేలా అభివృద్ధిలో అడుగులు వేయాల్సి ఉంది. పాలకుల నిర్లక్ష్యమో అధికారుల అలసత్వమో అర్థం కాదు గాని ప్రస్తుతం ఈ పాఠశాల లోపలకు వెళ్లేందుకే విద్యార్థులు భయపడుతున్నారు. కాలం చెల్లిన భవనాల మధ్య పాఠశాలలోకి అడుగు పెట్టగానే దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఈ ఐఎఎస్‌ల పాఠశాల పరిస్థితి మారింది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనకడుగు వేస్తూనే ఉంది. 1908లో ఏర్పాటుచేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుకుంది. ఎప్పుడు ఏ భవనం కూలుతుందోనని అటు విద్యార్థులతోపాటు ఇటు గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థుల సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన భవనాలను ఎందుకు తొలగించడం లేదో అంతుపట్టని విషయంగా మారింది. ఈ భవనాలతో పాటు పరిపాలన భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే శ్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో ఉపాధ్యాయులు ,సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం నెట్టుకొస్తున్నారు. ఏదిఏమైనా ప్రస్తుత నందలూరు ఐఎఎస్‌ల పాఠశాల దుస్థితి దారుణంగా తయారైంది. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాలంచెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే మరి ఇలాంటి తరుణంలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్దతిలో క్లాసులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అవస్థలు పడుతున్నారు. రెండు పూటలా క్లాసులు నిర్వహిస్తే విద్యార్థుల్లో మేధాసంపత్తి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఒకే పూట కావడంతో మిగిలిన సమయంలో విద్యార్థులు వృథాగా తిరుగుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రూరల్ అర్బన్ మిషన్ కింద కళాశాల సొంత భవనాలకు దాదాపు రూ.65 లక్షల నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా నిర్వహించారు. ఈ టెండర్లను రద్దు అయినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా శాసనసభ్యులు మేడా మల్లికార్జున్‌రెడ్డి ప్రస్తుతం నందలూరు పాఠశాల, కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల వాసులు, విద్యార్థులు కోరుతున్నారు.

చెట్ల కిందనే నిర్వహిస్తున్న తరగతులు (ఫైల్ ఫోటో)

విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఆర్‌బికె చైర్మన్ భాస్కర్

విద్యార్థులకు చెకుముకి పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించారు. స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు మండలంలోని ఏడు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షల్లో మండలంలోని కొత్త మంచూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతి, పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. మండల స్థాయి విజేతలు డిసెంబర్ నెలలో రాయచోటిలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ఆర్‌బికె చైర్మన్ భాస్కర్ చేతులమీదుగా షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్, పాఠశాల హెచ్‌ఎం అమరనాథరెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రరెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీదేవి

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్యారంపల్లిలో జరిగిన-17 బాలబాలికల విభాగం జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలో డి.మౌనిక, డి.అంజలి, ఎస్.హారిక, ఎస్.షాఫీ ప్రతిభ చూపారన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఒకేసారి నలుగురు విద్యార్థులు ఎంపికవడం పాఠశాల చరిత్రలోనే ఇది మొదటిసారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులలో ప్రతిభకు కొదవలేదని, వారిని సరైన మార్గంలో ప్రోత్సహిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటుతారన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు మంచి ప్రతిభను కనపరుస్తారని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భద్రయ్య, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ బాబు, వెంకటగోపాల్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణం సమీపంలో బద్దిపల్లి గృహ నిర్మాణ పనులను శనివారం నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడానికి ఎంపికైన లబ్ధిదారులకు నిధులను మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ప్రోత్సహిస్తోందన్నారు. బద్దిపల్లి జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇ గిరిధర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సరోజ్ బాషా, ప్రణీత్యయ, మహమ్మద్ జియా ఫాజిల్, వీఆర్‌ఒ వెంకటరమణ పాల్గొన్నారు.

21, 22న జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 21, 22వ తేదీల్లో పలు క్రీడలకు సంబంధించిన పోటీలను ఎంపికలు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు అంజాద్‌అలీ, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త కె.తాజ్ బాషా, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జి.ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 21వ తేదీ కబడ్డీ, వాలీబాల్, 22న బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 17 ఏళ్ల నిండినవారై ఉండాలని తెలిపారు. జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు.

పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి వేణుగోపాల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరుగు కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ గురించి వాకబు చేశారు. అనంతరం క్రాస్ రోడ్ లో జరుగుతున్న ఎలిసిడిసి కార్యక్రమాన్ని సందర్శించి ఆశ కార్యకర్తలు చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. డ్రై డే కార్యక్రమం, వెక్టర్ కంట్రోల్ హైజీన్ ఆవ్ ప్రాముఖ్యత గురించి ఆరోగ్య కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. గ్రామంలోని గృహాలను సందర్శించి లార్వా గురించి వాకబు చేశారు. మురుగు నీరు వున్న చోట అబెట్ బాల్స్ వేయాలని, సచివాలయం సిబ్బందితో కలిసి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, ఎక్కడ నీరు నిలువ లేకుండా చూడాలని ఆదేశించారు. వీరి వెంట సబ్ యూనిట్ అధికారి గఫూర్, సూపర్వైజర్ దేవేంద్ర వైద్యాధికారులు డాక్టర్ సునీత, డాక్టర్ యూస్ఫ్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్‌లో ఇంటిపేరు, చిరునామా మార్పు

Chittoor Saritha, W/o Chittoor Kishore Kumar, H.No.2-100/3, M.R.Palli, Tirupati, Chittoor Dist నుండి VARAMULA SARITHA, W/o Chittoor Kishore Kumar. D.No.6-889, Opp Police Station, Kalikiri Vill & Mandal, Annamaiah (Dist). 517234 కు మార్పు చేస్తున్నాను.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా కె.వి. పల్లి మండలం, సొరకాయల పేట పంచాయితీ, కుప్పంవారిపల్లికి చెందిన పోతిరెడ్డి స్వాతి D/o సంజీవరెడ్డి అను నేను 05-11-2022వ తేదీన పీలేరు నుండి కుప్పం వారిపల్లెకి ఆర్.టి.సి. బస్సులో ప్రయాణం చేస్తూ ఇండియన్ పాస్‌పోర్టు నెంబరు: J9830177 పోగొట్టు కోవడం జరిగింది. ఎవరికైనా దొరికితే ఈ సెల్ నెంబరుకు 9100639720 సమాచారం ఇవ్వగలరు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లికార్జున్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల అలసత్వం చేస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్తు, జగనన్న ఇళ్ల పనులను పర్యవేక్షించే అధికారులు ఎక్కువగా అలసత్వం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషియాలని సూచించారు. విద్య, వైద్య, పశు, వ్యవసాయ, ఆర్టీసీ, నాడు నేడు సంబంధిత అభివృద్ధి పనులపై సమీక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఉపయోగపడే అనేక పథకాలు ప్రజల కోసం ప్రవేశపెట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందే విధంగా పనిచేయాలని అలాగే మండలంలో గడపగడప కు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో వచ్చినటువంటి సమస్యలపై ఎంతవరకు పురోగతి సాధించారు అనే విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు చెప్పిన పలు సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే చర్యలు తప్పవని అధికారులను తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నా ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మన సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారికి ఎటువంటి సమస్యలు లేకుండా వారిని అన్ని విధాలుగా ఆదుకుంటూ వారి తల్లిదండ్రులు మీపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయులపై మరియు విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ, ప్రజాప్రతినిధులు వారి యొక్క గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి భోజనాలు విద్యార్థులకు పెడుతున్నారో పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, తహశీల్దార్ రవిశంకర్ రాజు, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు పాల్గొన్నారు.

'పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పుస్తకాలను చదవడం వలన విజ్ఞానం పెరుగుతుందని ఎస్‌ఐ బిందుమాధవి అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సమావేశం నిర్వహించారు. వారం రోజులపాటు నిర్వహించిన వివిధ రకాల వ్యాసరచన పోటీలు, తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా ప్రపంచంలో జరిగే విశేషాలతో పాటు పోటీ పరీక్షలలో సులువుగా ఉత్తీర్ణత సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, లక్ష్మినరసమ్మ, జీవన్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్, చిత్ర లేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించగా వాటిలో గెలుపొందిన 45 మంది విద్యార్థులకు ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిరోజు గ్రంథాలయాన్ని సందర్శించి అందులో ఉన్న విలువైన పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని కొనియాడారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండి మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అమరనాథ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ రెడ్డి శేఖర్, స్థానిక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, మాజీ ఉప సర్పంచ్ మాలిక్, వైసిపి నాయకులు ఎస్.ఎస్ ఫయాజ్, నక్క మహేష్ హాజరయ్యారు. పవన్ రాయల్, శశి భూషణ్ పిల్లలకు వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. **మదనపల్లె అర్బన్:** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మహిళా సాధకారత, దిశ చట్టం గురించి రిటైర్డ్ మునిసిపల్ కమిషనర్ సహదేవరావు అధ్యక్షతన వహించి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశానీరజ, అడ్వకేట్ ఎం.మాలతీ, మహిళ పోలీస్ నందిని, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, సుభాషిణి, రామమూర్తి, మంజుల, రేణుక, గౌసియా గ్రంథాలయ సిబ్బంది ప్రమీలమ్మ, జయమ్మ, మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **తంబళ్లపల్లి :** గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రోజువారి జరిగిన పోటీ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల పంపిణీ చేశారు.

కడకడ : విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపిపి

కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, హెచ్‌ఎం ఆంజనేయులు, మొగళిలేశ్వరయ్య, గ్రంథాలయ అధికారి జిలాని భాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు:** గ్రంథాలయంలో వ్యాసరచన, డ్రాయింగ్, చెస్, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, గ్రంథాలయ అధికారి రవిశంకర్ రాజు, నాగిరెడ్డిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం గంగిరెడ్డి, యుటిఎఫ్, జెవివి నాయకులు రౌఫ్‌బాష, కృపానందం, విశ్రాంత ఉపాధ్యాయుడు చెంచునాగయ్య, గ్రంథాలయ సహాయకులు రవి పాల్గొన్నారు. **పీలేరు:** గ్రంథాలయాలు మనిషిని మహోన్నత వ్యక్తిగా తయారు చేస్తాయని అర్బన్ సిఐ ఎన్.మోహన్‌రెడ్డి తెలిపారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, వైస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ డి.చిన్నమ్మ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎండి షఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి:** విద్యార్థులు ఇతరులతో పోటీపడినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. మండల లైబ్రేరియన్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సాయినాథ్, ఉపాధ్యాయులు మార్ల ఓబుల్‌రెడ్డి, వెంకట్రామరాజు, రెడ్డయ్యరెడ్డి, నబిరసూల్, శంకరయ్య పాల్గొన్నారు.

విసికె రాష్ట్ర కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-పీలేరు

విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె) రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా పాలకుంట శ్రీనివాసులు నియమితులయ్యారు. గుంటూరులో రెండ్రోజుల పాటు జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఈ ఎన్నిక జరిగినట్లు శ్రీనివాసులు తెలిపారు. పీలేరుకు చెందిన తనను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాసులు భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా కో-కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. తనకు అప్పగించిన పదవిని బాధ్యతగా భావించి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తానని తెలిపారు.

మీడియా వింగ్ కార్యదర్శిగా పీర్‌బాషా

మదనపల్లె అర్బన్: విసికె రాష్ట్ర మీడియా వింగ్ కార్యదర్శిగా పీర్‌బాషా నియమితులయ్యారు. మదనపల్లెకు చెందిన తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పీర్‌బాషా భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా ముస్లిం విభాగం కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. తనకు అప్పగించిన పదవిని బాధ్యతగా భావించి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తానని తెలిపారు.

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న లోకేశ్వర్‌రెడ్డి

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఎన్‌ఫోర్‌సమెంట్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దకు సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. అలా లేనియెడల పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని భోజన పథకంలో ఎటువంటి అవకతవకలు ఏర్పడిన సహించబోనని తెలిపారు. పిల్లల హాజరుపై ప్రధానోపాధ్యాయురాలికి కొన్ని హిత బోధనలు ఏ విద్యార్థి అయిన స్కూలుకు రాని ఎడల వారి తల్లిదండ్రులకు కచ్చితంగా తెలపాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ రంగనాథయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, హరి పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాక్ డే కార్యక్రమంలో భాగంగా హిందీ ఉపాధ్యాయుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆరవ తరగతి విద్యార్థులకు హిందీ బాల్ గీత్ పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కె.బబిత బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ చాలా సరళమైన భాష అని, హిందీ పాటలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయని తెలిపారు. హిందీ భాష సులభంగా నేర్చుకోవాలంటే హిందీ సినిమాలు చూడటం,

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం సబిత

హిందీ పాటలు వినడం చేయాలన్నారు. పిల్లలు విద్యార్థి దశ నుండే హిందీ బాల గేయాలువినడం, హిందీ బాల కథలు చదవడం అలవాటు చేసుకోవడం ద్వారా హిందీ భాషను సరళంగా నేర్చుకోవచ్చని తెలియజేశారు. హిందీ భాష సరళంగా మాట్లాడడం వచ్చినప్పుడు ప్రపంచ దేశాలలో ఎక్కడైనా నివసించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఎన్.రాజు, సుధాకర్, గుర్రప్ప అబ్దుల్ కరీం పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : ఎస్ఐ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శోభ అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ వాలంటీర్లకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ తమ పరిధిలోని 50 కుటుంబాల వారికి నేడు సమాజంలో జరుగుతున్న మోసాలు, సైబర్ నేరకాల ప్రవర్తన వారు చేసే మోసం తీరు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ నేరగాళ్లు సెల్ఫోన్ల ద్వారా కాల్ చేసి తెలిసిన వ్యక్తిగా మద్దతు ఇచ్చే మాటలు చెప్పి వారి అకౌంట్‌కు డబ్బు వేయించుకోవడం, వారి సెల్ నెంబర్లు డ్రాప్ చేసి పూర్తి వివరాలు సేకరించడం అనంతరం వారి ఖాతాలో నుండి డబ్బు కొల్లగొట్టడం వంటి నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ములకలచెరువు

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంది ప్రజా సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపిడిఒ అశ్విని పేర్కొన్నారు. శనివారం మండలంలోని దేవలచెరువు సచివాలయం పరిధిలో ఉన్న పంచాయతీలను సందర్శించారు. అనంతరం పత్తికోట, దేవలచెరువు పంచాయతీలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను లేవట్లను పరిశీలించి లబ్ధిదారులు ఎంపికలు తీసుకొని పాటించాల్సినటువంటి నియమాలను సచివాలయ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో దేవునిచెరువు సర్పంచ్ ప్రభావతి, పత్తికోట సర్పంచ్ మనోహరమ్మ, ఎంపీటీసీ పెద్ద నరసింహులు ప్రజా ప్రతినిధులు ఉమామహేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ అశ్విని

లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పక్కా గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ లీలా మాధవి అన్నారు. శనివారం వారు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో మండల పరిధిలోని దండువారిపల్లి, కొండయ్యగారిపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్ లో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణ పనులను పరిశీలించామని పేర్కొన్నారు. నిర్మాణాలను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ వస్తువులపై ధరలను నియంత్రించాలని ఆదేశించారు. జగనన్న లేఅవుట్‌లో మౌలిక వసతులను కల్పించాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరినాథ్‌రెడ్డి, పిఆర్ ఇన్‌ఛార్జి ఎఇ వరప్రసాద్, ఎపిఒ రమేష్, ఇంజినీరింగ్ సహాయకులు పురుషోత్తం, హేమ, అశ్విని, హౌసింగ్ సిబ్బంది అనూష, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రజాశక్తి - రాయచోటి

భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 105వ జయంతిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాస్ సిఎల్‌పి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి డెలిగేట్ ఎస్.ఎండి. గౌస్ హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ మొట్టమొదటి మహిళా ప్రధానిగా పనిచేశారని దేశంలో అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల ఆదరణ పొందాలని పేర్కొన్నారు. ఆమె ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి భారత దేశ కీర్తిని ప్రచురింప చేసిందన్నారు. కార్యక్రమంలో అల్లాబకాస్ మాట్లాడుతూ అలీన దేశ అధ్య క్షులుగా బ్యాంకులను జాతీయరకరణ చేశారన్నారు. కార్యక్రమంలో పిసిసి మైనార్టీ ఉపాధ్యక్షులు మహ్మద్ రఫీక్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మంజునాథ, రామాపురం మండల అధ్యక్షులు రామదాస్, ఖాదర్‌ఖాన్, రవణమ్మ, మహబూబ్ జాన్, జగదీశ్వర్‌రెడ్డి, రఘునా థరెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, ఇమ్రాన్, ఇర్ఫాన్, మణికంఠ, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

పొలంబడిపై అవగాహన

ప్రజాశక్తి-వీరవల్లి

క్లస్టర్ లెవెల్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి స్వాతి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పెద్దవీడు పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు పొలంబడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ హాజరై మాట్లాడుతూ 14 వారాలపాటు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. బృందాలుగా పంటను పరిశీలించి, నేల, మొక్క, ఆరోగ్య స్థితి, కలుపు మొక్కలు తొలగింపు, తెగుళ్ల నివారణ వంటివాటిపై రైతులకు సూచనలు సలహాలిస్తామన్నారు. ప్రకృతి, రసాయన వ్యవసాయానికి తేడా ఇంకా మెరుగైన పద్ధతులు పాటించడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, ఎంపిటిసి భర్త ఆంజనేయులు, సింగల్ విండో అధ్యఓఉలు అమర్‌నాథరెడ్డి, సర్పంచ్ తనయుడు నరసింహులు, శ్రీకాంత్, మజీద్, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అధికారి రవి, ఏవోలు షణ్ముగం, మల్లికా, రమేష్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతన్న ఈశ్వరయ్య

బిసిల అభ్యున్నతికి కృషి

వీరబల్లి : బిసిల అభ్యున్నతికి కృషి చేస్తానని జిల్లా బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తరిగొండ ఈశ్వరయ్య అన్నారు. గురప్పగానపల్లి పంచాయతీ సుబ్బరామరాజు అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడి ఉన్న బిసిలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. బిసిల సమస్యలపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్తారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో బిసిల సంఖ్య ఎక్కువగా ఉన్నా బిసిలకు న్యాయం జరగలేదన్నారు. మండల స్థాయిలలోనూ బిసిలతో కమిటీ ఏర్పాటుచేసి నాయకులను నియమిస్తామని చెప్పారు. ఇప్పటికే బిసిలు చాలా వెనుకబడి ఉన్నారని, వారికి ప్రభుత్వం తరఫున పలు సంక్షేమ పథకాలతో పాటు కార్పొరేషన్ రుణాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుర్రప్పగారిపల్లి వైసిపి నాయకులు సుబ్బరామరాజు, రియల్ ఎస్టేట్ పెంచలయ్య, రమణయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

వీరబల్లి : విద్యాభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి అన్నారు. మండలంలోని మట్లి గ్రామం పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులకు శనివారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. అన్ని మౌలిక వసతులతో తరగతి గదుల ను నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మట్లి పంచాయతీలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ రామాంజలురెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం రైతులు, అధికారుల సహకారంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. భవిష్యత్తులో రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించి ఉపయోగపడతారని తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలను గుర్తు చేసుకోవాలి

గాలివీడు : భారత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ సేవలను అందరూ గుర్తు చేసుకోవాలని మండల వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు పెట్టుకోలేని స్థితిలో ఉన్నామని చెప్పారు. నెహ్రూ, మహాత్మగాంధీ సేవలను గుర్తు చేసుకుని వారి బాటలో నడవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రామచంద్రనాయక్, ఉపాధ్యాయులు నరేంద్ర, నారాయణమ్మ బాలికల ఉన్నత పాఠశాల స్కూల్ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న, రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి సుచరితకు బహుమతి ఇస్తున్న యధుభూషణ్‌రెడ్డి